క్లుప్తంగా

నియామకం



నర్సంపేట : పట్టణానికి చెందిన కురిమిళ్ల రమేశ్‌చారి బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు. సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు రమేశ్‌చారిని నియమిస్తూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ డ్యాగల శ్రీనివాస్ మంగళవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్‌చారి మాట్లాడారు. సంఘం బలోపేతానికి పాటుపడతానని చెప్పారు.

సన్మానం



రాయపర్తి : వర్ధన్నపేట సీఐ శ్రీనివాసరావును కాంగ్రెస్ అనుబంధ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గబ్బెట బాబు మంగళవారం శాలువాతో సన్మానించారు. తొలుత సీఐని బాబు ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ఉల్లెంగుల యాదగిరి, కందికట్ల రాజయ్య, చెడుపాక యాకయ్య, జలగం యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

జెల్ల శ్రీనివాస్ దంపతులకు..



నర్సంపేట : పట్టణంలోని ఉప్పలయ్య హోటల్‌కు జాతీయ స్థాయి గుర్తింపు లభించిన సందర్భంగా యజమాని జెల్ల శ్రీనివాస్ దంపతులను పట్టణానికి చెందిన నల్ల భారతి సుధాకర్‌రెడ్డి దంపతులు వారి నివాసంలో మంగళవారం నూతన వస్త్రాలు బహూకరించి సన్మానించారు. అనంతరం భారతి సుధాకర్‌రెడ్డి దంపతులు మాట్లాడారు. హోటల్‌కు జాతీయ స్థాయి గుర్తింపు లభించడం అభినందనీయమని తెలిపారు.

దోమల నివారణకు ఫాగింగ్

రాయపర్తి : మండలంలోని రాయపర్తి, జేతురాంతండా, మైలారం, ఆర్ అండ్ ఆర్‌కాలనీ, తదితర గ్రామాల్లో పంచాయతీ కార్మికులతో మంగళవారం మూడు మిషన్ల ద్వారా ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీఓ కూచన ప్రకాష్ మాట్లాడారు. దోమల నివారణ కోసం మండలంలోని గ్రామాల్లో ఫాగింగ్ చేయిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

దుగ్గొండి : రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలైన ఘటన మండలంలోని గిర్నిబావిలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. నర్సంపేట నుంచి వరంగల్ దిశగా వెళ్తున్న కారు, వరంగల్ నుంచి నర్సంపేట వైపు వెళ్తున్న ఆటో ఒకదానిని మరొకటి గిర్నిబావి సమీపంలో ఢీకొన్నాయి. అదే సమయంలో ఆటో మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న వరంగల్‌కు చెందిన సంజీవ్, మాధవన్, మనోజ్, ద్విచక్ర వాహనంపై వెళ్తున్న తిమ్మంపేటకు చెందిన గోరేమియా, అతడి సతీమణి పర్వీన్ గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను వరంగల్‌లోని ఆస్పత్రిలో చేర్పించారు.

నివాళి

చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన పున్నం రాజు (38) అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు నన్నెబోయిన రమేష్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు పద్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ డ్రైవర్‌కు..

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సిద్దార్థ హైస్కూల్‌లో బస్సు, కారు డ్రైవర్‌గా పని చేసిన పున్నం రాజు(38) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మృతి చెందగా ఆయన మృతదేహానికి సిద్దార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, హెచ్‌ఎం అండెం కరుణాకర్‌రెడ్డి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగదీశ్, మేడి రమేశ్, బొనగాల రమేశ్, కొండపర్తి కృష్ణమోహన్, వల్లవేణు, కందిక నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

గీసుకొండ : మండలానికి చెందిన బిట్ల మొగిలి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సమాజ సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి మంగళవారం రూ.5 వేల సాయం పంపించారు. అలాగే రంపీస శ్యాంసుందర్ ప్రమాదంలో గాయపడగా ఆయనకు సైతం రూ.5 వేల సాయం పంపారు. బాలకిశోర్‌రెడ్డి పంపిన డబ్బును స్థానిక నాయకులు అల్లం మర్రెడ్డి, మాదాసి రాంబాబు, తిరుమలరెడ్డి దిలీప్‌రెడ్డి, కందికొండ రాజ్‌కుమార్, బిట్ల శివప్రసాద్, అడ్డాల దశరథ్ కుమార్ అందజేశారు.

చెప్పుకోలేని వేదన

- ఎంపీడీఓ కార్యాలయంలో పని చేయని మరుగుదొడ్లు
- వాటర్ ట్యాంకు పగిలి నీటి కొరత
- మహిళా ఉద్యోగుల పరిస్థితి దయనీయం





ఎంపీడీఓ కార్యాలయం (ఇన్‌సెట్‌లో పగిలిపోయిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు

సంగెం : మండల పరిషత్ కార్యాలయ ఉద్యోగులు చెప్పుకోలేని వేదన అనుభవిస్తున్నారు. కార్యాలయంలో మరుగుదొడ్లు పని చేయడం లేదు. వాటర్ ట్యాంకు పగిలిపోయి నీటి కొరతతో సతమతమవుతున్నారు. మహిళా ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా తయారైంది. బోరు బావి ఉన్నా కార్యాలయ మొత్తానికి సరఫరా చేసే ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకుని రెండు నెలల క్రితం పగిలిపోయింది. నాటి నుంచి కార్యాలయంలోని ఎంపీపీ, ఎంపీడీఓ, ఏఈల చాంబర్లలోని మరుగుదొడ్లకు బకెట్లలో నీరు తెచ్చి ఉపయోగించుకుంటున్నారు. మహిళ ఉద్యోగుల కోసం ప్రత్యేకించి నిర్మించిన మరుగుదొడ్డి ట్యాంకు పగిలిపోవడానికి ముందే ధ్వంసం అయిపోయింది. కార్యాలయంలో పని చేసే మహిళా ఉద్యోగులే కాకుండా కార్యాలయానికి వచ్చే మహిళా పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా ప్రతినిధులను సమస్య వేధిస్తోందంటే అతిశయోక్తి లేదు. కార్యాలయానికి ప్రతిరోజూ కనీసం 25–30 మంది మహిళా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, తదితరులు వచ్చి పోవడం పరిపాటి. కొద్ది రోజుల కిందటి వరకు మహిళా ఎంపీపీ అధికారంలో ఉన్నా సమస్య పరిష్కారం కాలేదన్న వ్యాఖ్యలు వినవస్తున్నాయి. ఇకనైనా మండల పరిషత్ ప్రత్యేక అధికారి, డీఎల్‌పీఓ వేదవతి సమస్యను పరిష్కరిస్తారో? లేదో? అని వేదన చెందుతున్నారు. బకెట్లతో నీరు తెచ్చి ఉపయోగించడం వల్ల మిగిలిన మరుగుదొడ్లలో దుర్వాసన అధికంగా రావడంతో వినియోగించుకోలేక పురుష అధికారులు సైతం ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు సమస్య పరిష్కరించాలని ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు.

నిధులు లేక మరమ్మతులో జాప్యం

మండల పరిషత్ కార్యాలయంలో నీటి, మరుగుదొడ్ల సమస్య ఉన్నది వాస్తవమే. నిధుల కొరత కారణంగా మరమ్మతులు చేయించలేకపోతున్నాం. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నిధులు మంజూరు కాగానే పాడైపోయిన మరుగుదొడ్డికి మరమ్మతు చేయించడంతోపాటు ఓవర్ హెడ్ ట్యాంక్ ఏర్పాటు పనులు చేయిస్తాం.

-కాసర్ల రవీందర్, ఎంపీడీఓ, సంగెం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు



ఖానాపురం : మాట్లాడుతున్న డాక్టర్ ప్రకాశ్



నెక్కొండ : రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అర్చన

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాశ్

ఖానాపురం : ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందుతున్నాయని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాశ్ తెలిపారు. మండలంలోని అశోక్‌నగర్‌లో మంగళవారం నిర్వహించిన మెగా వైద్యశిబిరానికి ప్రభుత్వ వైద్య కళాశాల హెచ్‌ఓడీ పూనమ్ కుమారీ ఝాతోపాటు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్ అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నర్సంపేటలోని ప్రభుత్వ వైద్య కళాశాల, జిల్లా ఆస్పత్రి ఆధ్వర్యంలో పల్లెల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు మురళి, బాలాజీ, పరశురామ్, గిరిధర్, రాజునాయక్, అర్జున్‌రెడ్డి, పార్వతి, జ్యోతి, వాసవి, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని నందిగామ, కొండాపూర్ గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ పోరిక రవీందర్ నాయక్ నందిగామ, కొండాపూర్ గ్రామాల్లో జ్వరాలతో బాధపడుతున్న వారి ఇళ్లను సందర్శించారు. పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ రవీందర్ మాట్లాడారు. డెంగీ, మలేరియా, చికున్ గున్యా, టైఫాయిడ్ తదితర వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు వివరించారు. శిబిరాల్లో డాక్టర్ మహంత, డాక్టర్ శృతి, డాక్టర్ జయపాల్‌రెడ్డి, పీహెచ్‌ఎన్ కోమల, సూపర్‌వైజర్లు కిషన్, సాంబమూర్తి పాల్గొన్నారు.



నల్లబెల్లి : వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ రవీందర్

నెక్కొండ : మండలంలోని చిన్నకోర్పోలు శివారు పంతులుతండాలో అనారోగ్యంతో వివాహిత మృతి చెందగా అలంకానిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. అలాగే బొల్లికొండలో ఒకరికి డెంగీ నిర్ధారణ కావడంతో దోమల మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యురాలు అర్చన మాట్లాడారు. శిబిరంలో 98 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా 11 మంది జ్వరంతో బాధపడుతున్నారని తెలిపారు. రక్తపూత నమూనాలను పరీక్షించినట్లు వివరించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ మలేరియా అధికారి నంద, సూపర్‌వైజర్ రమాదేవి, పంచాయతీ కార్యదర్శులు సురేష్, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుకు రాయితీ



చాపలబండలో మాట్లాడుతున్న జ్యోతి

దుగ్గొండి : రైతులు అరటి, బొప్పాయి, తదితర ఉద్యాన పంటలు సాగు చేస్తే ప్రభుత్వం 40 శాతం సబ్సిడీ ఇస్తుందని డివిజన్ ఉద్యానశాఖ అధికారి జ్యోతి తెలిపారు. మండలంలోని మందపల్లి, చాపలబండ గ్రామాల్లో అరటి, బొప్పాయి తోటలను మంగళవారం ఆమె సందర్శించి పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. అరటి వేసిన రైతులు సకాలంలో ఎరువుల యాజమాన్యాన్ని పాటిస్తే గెల సమృద్ధిగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఉద్యాన పంటలు వేసే రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ అందించనున్నట్లు తెలిపారు. అరటి, బొప్పాయి సాగు చేసే రైతులు ఆధార్, పట్టాదారు పాస్‌బుక్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తోకల శ్రీనివాసరెడ్డి, ఎడెల్లి అశోక్‌రెడ్డి, ఆరె రాజిరెడ్డి, అంబరగొండ బాబురావు, పాలంపెల్లి సాంబరెడ్డి, తిరుపతిరెడ్డి, దామోదర్‌రెడ్డి, కరుణాకర్ రెడ్డి, హైమావతి, విజయ పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



నిర్లక్ష్యం.. ఎగబాకింది

అధికారుల నిర్లక్ష్యంతో మండలం కేంద్రంలోని కొండాయిల్‌పల్లి వెళ్లే దారిలోని ఎస్సారెస్పీ కాల్వ సమీపంలోని 11 కేవీ విద్యుత్ స్తంభంపైకి తీగ జాతి మొక్కలు ఎగబాకేశాయి. పచ్చటి తీగజాతి మొక్కలు స్తంభానికి ఎగబాకి విద్యుత్ తీగలకు అల్లుకోవడంతో విద్యుత్ సరఫరాలో తరుచూ అంతరాయం ఏర్పడుతోంది. తీగజాతి మొక్కలు ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు తొలగించకపోతుండడంతో చిన్నపాటి వర్షం కురిసినా, ఈదురుగాలులు వీచినా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి విద్యుత్ స్తంభానికి పాకిన తీగజాతి మొక్కలను తొలగించి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

-నల్లబెల్లి

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
సయ్యద్ హుస్సేన్, లైన్‌మెన్
ఫోన్‌నంబర్ : 8096842088

కిశోర బాలికల సంఘాలతో చైతన్యం



పర్వతగిరి : జూట్ బ్యాగులు ఇస్తున్న ఎంపీడీఓ



సంగెం : సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ

పర్వతగిరి : కిశోర బాలికల సంఘాల ఏర్పాటుతో విద్యార్థినుల్లో చైతన్యం పెరుగుతుందని ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. మండలంలో మదర్ థెరిస్సా మండల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం వీఓఏలకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. 15 నుంచి 19 ఏళ్ల వరకు వయసున్న బాలికలతో సంఘాలు ఏర్పాటు చేసి వారికి హక్కులపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. తద్వారా కిశోర బాలికల సంఘాలు బాల్య వివాహాలు అరికట్టడానికి, బాలికల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి, నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందడానికి కృషి చేస్తాయని చెప్పారు. సంఘాల ఏర్పాటులో జిల్లాలో మండలాన్ని ముందంజలో నిలపాలన్నారు. అనంతరం జూట్ బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం తోటకూరి కృష్ణమూర్తి, సీసీలు రమాదేవి, కాంతయ్య, రవిచందర్ రాజు, సుధాకర్, వీఓఏలు ఎంఎస్‌ఓబీ నాగమణి, భాగ్యలక్ష్మి, లత, పాల్గొన్నారు.

స్నేహహస్తం అందించేలా..

సంగెం : కిశోర బాలికలకు స్నేహహస్తం అందించేలా సంఘాలు ఏర్పాటు చేస్తున్నట్లు డ్వాక్రా ఏపీ సుజాత తెలిపారు. మండలంలోని శాంతి మండల సమాఖ్యలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సంఘాలు కిశోర బాలికల హక్కులు సాధించుకోవడానికి ఉపయోగపడతాయని చెప్పారు. విద్య, భద్రత, ఆరోగ్యం, పోషకాహారం, తదితర అంశాలపై చర్చించుకునే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో ఏపీఎం కిషన్, సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కర్నె కల్యాణి, రాజమణి, సీసీలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



సభ్యత్వ నమోదు రశీదులతో రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు

ఖానాపురం : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పీఆర్‌టీయూ ముందుకు సాగుతోందని జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. పలువురు ఉపాధ్యాయుల సభ్యత్వాన్ని నమోదు చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పరిష్కార దిశగా సహకారం అందిస్తామని తెలిపారు. సభ్యత్వ నమోదులో మండల శాఖలు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఇటీవల బదిలీ అయిన సంఘం బాధ్యులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గఫార్, మండల అధ్యక్షుడు అలువాల భిక్షపతి, నాయకులు నెల్లూరి ప్రసాదరావు, భాస్కర్, జేతురాంనాయక్, రాజు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనతోనే సాధికారత



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

సంగెం : చట్టాలపై అవగాహన పెంచుకోవడం ద్వారానే బాలికల్లో సాధికారత సాధ్యమని జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. సమాజంలో ఆడపిల్లలకు, మహిళలకు భద్రత కరువైందని ఆందోళన వెలిబుచ్చారు. మహిళలు వివక్షకు గురవుతున్నారని తెలిపారు. బాలికలు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. సమస్యలు వచ్చినపుడు కుంగిపోవద్దని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 181, 100, 14567, 155326, 1930లకు ఫోన్ చేసి సాయం పొందాలన్నారు. వ్యక్తిగత శుభ్రత, స్కిల్ డెవలప్‌మెంట్, కెరీర్, మహిళా సాధికారిత దిశగా చేపట్టాల్సిన కార్యాచరణను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో భాగస్వాములు కండి

దుగ్గొండి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అమలయ్యేలా చూడడంలో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు భాగస్వాములు కావాలని మండల అధ్యక్ష అభ్యర్థి కొత్తకొండ రవివర్మ సూచించారు. మండలంలోని మందపల్లి, పీజీతండా గ్రామాల్లో యూత్ ఎన్నికల్లో భాగంగా ఇండియన్ యూత్ కాంగ్రెస్ మెంబర్‌షిప్‌పై మంగళవారం ఆయన అవగాహన కల్పించి మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని చెప్పారు. ఐవైసీ యాప్‌లో తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు జయరాంనాయక్, నాయకులు రాజేశ్వరాచార్యులు, జంగిలి రవి, రేవూరి వెంకటరెడ్డి, డ్యాగం శివాజీ, కమలాకర్, శ్రీను, క్రాంతి, వివేక్, హరీశ్, కృష్ణకాంత్, నేతాజీ పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

రాయపర్తి : క్రీడలతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని మండలంలోని కాట్రపల్లిలోని ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం ఝాన్సిలక్ష్మి తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్కూల్‌లో మంగళవారం ముందస్తుగా క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడారు. క్రీడలు దేహదారుఢ్యానికి దోహదపడతాయని చెప్పారు. విద్యార్థులు ఆటపాటల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పీఈటీ పుట్ట సమ్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాచైతన్యంతోనే మూఢనమ్మకాలకు చెక్



కళాజాతలో మాట్లాడుతున్న ఎస్సై ప్రవీణ్

పర్వతగిరి : ప్రజలు చైతన్యవంతం కావడం ద్వారానే మూఢనమ్మకాలకు చెక్ పెట్టగలమని ఎస్సై బోగం ప్రవీణ్ తెలిపారు. మండలంలోని కొంకపాకలో జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలు మూఢనమ్మకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్, తదితరాల నిర్మూలనలో ప్రజలు పోలీసులకు సహకరించాలని చెప్పారు. గ్రామాలను నేర రహితంగా తీర్చిదిద్దాలని కోరారు.

‘హత్యాచార నిందితులను శిక్షించాలి’

పర్వతగిరి : కోల్‌కత్తాలో వైద్యవిద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడారు. పీజీ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను శిక్షించడంలో తాత్సారం తగదన్నారు. కేసును సీబీఐకి అప్పగించి బాధిత కుటుంబానికి సత్వర న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి ఎద్దు రాహుల్, గర్ల్స్ కన్వీనర్ శ్రీజ మాట్లాడుతూ ఘటనను ఖండించారు. కార్యక్రమంలో నాయకులు రమ్యశ్రీ, అద్విక, దీక్ష, ఉల్లెంగుల సిద్దు, దామసాని సంతోశ్‌కుమార్, రామసాని సుమంత్, రాచా ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల చెంతకు కార్గో సేవలు

పర్వతగిరి : ఆర్టీసీ కార్గో సేవలు ప్రజల చెంతకు చేర్చుతున్నట్లు వరంగల్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పవన్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని చౌరస్తాలోని సైకి ఇంటర్నెట్‌లో ఏర్పాటు చేసిన ఆర్టీసీ కార్గో సేవల కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు తక్కువ సమయంలో కొరియర్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వ్యాపారస్తులు, రైతులు, మండల ప్రజలు కార్గో సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ వరంగల్ రీజియన్ సేల్స్ లీడర్ ఎస్.రామయ్య, కార్గో ఏజెంట్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై నేడు ఫిర్యాదుల స్వీకరణ

ఖానాపురం : రుణమాఫీపై మండలంలోని రాగంపేటలో నేడు (బుధవారం) ఉదయం 10 గంటలకు, కొత్తూరులో మధ్యాహ్నం 12 గంలకు ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు ఏఓ బోగ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ఖానాపురం ఏపీజీవీ బ్యాంకులో రుణాలు తీసుకుని కుటుంబ సభ్యుల నిర్ధారణ అవసరమైన రైతులు దరఖాస్తులు అందజేయాలని చెప్పారు. ఆధార్ ఒరిజినల్‌తోపాటు జిరాక్స్, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, రైతు పంటరుణ బ్యాంక్ పాస్‌బుక్, దరఖాస్తు, తదితర పత్రాలతో రావాలని తెలిపారు.

కవితకు బెయిల్ రావడంపై హర్షం



నర్సంపేట : బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ రావడం పట్ల తెలంగాణ ఉద్యమకారుడు, విద్యార్థి నాయకుడు తడిగొప్పుల మల్లేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద విద్యార్థులతో కలిసి మంగళవారం స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మల్లేశ్ మాట్లాడారు. కవితపై నిందారోపణ చేసి రుజువు చేయకుండా దాదాపు 130 రోజులపాటు జైలులో నిర్బంధించారని చెప్పారు. ఎట్టకేలకు న్యాయమే గెలిచిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తడిగొప్పుల ప్రవీణ్‌కుమార్, విష్ణు, నాగరాజ్, మణికంఠ, సుభాష్, రాజు, సురేశ్, రేణుక, రజిత, అనూష, రాధిక, సమీనా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు కాపాడాలి

నర్సంపేట : బీఆర్‌ఎస్ పాలనలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను కాపాడి పేదలకు పంచాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (బొజ్జతారకం) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకేశ్వరపు రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, భూకబ్జాదారులు వేలాది ఎకరాల ప్రభుత్వ భూములకు ఆక్రమించారని ఆరోపించారు. జిల్లా, డివిజన్ కేంద్రాల్లో కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని ఆకాంక్షించారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన

సంగెం : మండలంలోని ఎల్గూర్ స్టేషన్ పరిధిలో నిర్మించిన ఆలయంలో నేటి (బుధవారం) నుంచి సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహిస్తామని నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం గణపతి పూజతో ప్రారంభమై గురువారం విగ్రహ ప్రతిష్ఠాపనతో ముగుస్తుందని పేర్కొన్నారు.

సెప్టెంబర్ 3న ‘మహాసభ’ అధ్యక్షుడి ఎన్నిక

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 16వ డివిజన్ కీర్తినగర్ కాలనీలో సెప్టెంబర్ 3న ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిని ఎన్నుకోనున్నట్లు ఎన్నికల కన్వీనర్ వంగేటి అశోక్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 1న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్లు స్వీకరించి అదే రోజు పరిశీలించి పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని తెలిపారు. అలాగే 2న నామినేషన్ల ఉపసంహరణ గడువు కాగా 3న ఉదయం పోలింగ్, మధ్యాహ్నం 3 గంటల నుంచి కౌంటింగ్, ఫలితాల ప్రకటన ఉంటుందని వివరించారు. ఇతర వివరాల కోసం తనను సెల్ నంబర్ 98661 39061లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో మహాసభ మండల అధ్యక్షుడు ఇమ్మడి శ్యాంబాబు, కీర్తినగర్ అధ్యక్షుడు సురేందర్, నాయకులు భద్రయ్య, శ్రీనివాస్, సోమేశ్వర్, మధు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.